సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



పౌర సేవలపై విస్తృత అవగాహన

సచివాలయాల్లో అమలు చేస్తున్న పౌరసేవలపై విస్తృత అవగాహన కల్పించాలని డీఆర్వో రాజశేఖర్ అన్నారు. - 8లో



పశుపోషణతో ఆర్థిక పురోగతి

పశుపోషణ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలనివ్యవసాయ మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి అన్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	24
తిరుపతి	33	25
తిరుమల	28	21
గూడూరు	35	27
నగరి	34	25

న్యూస్‌రీల్

న్యాయ విభాగంలో నియామకాలు



లోకేశ్వరరెడ్డి



సూర్యప్రతాప్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల న్యాయవిభాగం(లీగల్‌సెల్)లో పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు జిల్లా న్యాయ విభాగ జోనల్ ఇన్‌చార్జిగా లింగాల లోకేశ్వర రెడ్డి, న్యాయవిభాగం జిల్లా అధ్యక్షుడిగా సూర్య ప్రతాప్‌రెడ్డిని నియమితులయ్యారు.

ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బైజూస్ కోఆర్డినేటర్‌లు

చిత్తూరు కలెక్టరేట్ : డీఈవో కార్యాలయంలో ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బైజూస్ కో–ఆర్డినేటర్‌లు సుధాకర్, మోహన్‌సింగ్ ట్యాబ్‌ల వినియోగం, సాంకేతిక సమస్యల పరిష్కారం, కంటెంట్‌లపై అవగాహన కల్పించారు. సాఫ్ట్‌వేర్ సమస్యలను పరిష్కరించే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. పలు పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.

తానా నారీ సాహిత్య భేరికి సుగుణ



సుగుణ మద్దిరెడ్డి (ఫైల్)

ఐరాల: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24 తేదీన నిర్వహించనున్న నారీ సాహిత్య భేరి అంతర్జాతీయ కవయిత్రుల సమ్మేళనం కార్యక్రమానికి మండలంలోని ఐలవారిపల్లెకు చెందిన ప్రముఖ రచయిత్రి సుగుణమద్దిరెడ్డికి ప్రత్యేక అతిథిగా ఆహ్వానం అందింది. ఈ మేరకు తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర, సమన్వయకర్త చిగురుమళ్ల శ్రీనివాస్ ఆహ్వానం పంపారు. 14 గంటల పాటు నిర్విరామంగా జరిగే సాహిత్య సమ్మేళనంలో మన దేశంతో పాటు విశ్వ వ్యాప్తంగా 15 దేశాలకు చెందిన ఇద్దరు తెలుగు కవయిత్రులు, రచయిత్రులు పాల్గొననున్నారు. ఇందులో సుగుణమద్దిరెడ్డి సాహిత్యం, కవిత్వంపై ప్రసంగించనున్నారు. ఈమె ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ సాహితీ సేవ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుగుణకు పలువురు సాహితీవేత్తలు, సాహితీ సంస్థల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీలకు రూ.1.62 కోట్లు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఎన్నికలు జరిగి పాలకవర్గాలు ఏర్పడిన 684 గ్రామ పంచాయతీలకు ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికి సంబంధించి ప్రభుత్వం రూ.1.62 కోట్లు నిధులను గురువారం విడుదల చేసింది. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు పారితోషకం రూపేణ సర్పంచ్‌లకు రూ.62.73 లక్షలు, సీనరేజ్ చార్జీల రూపేణ రూ.58.55 లక్షలు, తలసరి గ్రాంట్ పరంగా రూ.14.90 లక్షలు, ప్రొఫెషనల్ ట్యాక్స్ పరంగా రూ.25.95 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 64,277 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,340 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 2.89 కోట్ల ఆదాయం వచ్చింది. సాధారణ భక్తులకు దర్శనానికి 8గంటల సమయం పడుతోంది.

561 కరెంట్ అక్రమ సర్వీసులు

- రూ.12.31 లక్షల అపరాధం

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్లలోని సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,314 సర్వీసులను తనిఖీ చేశారు. తిరుపతి ఆపరేషన్ పరిధిలో 109, తిరుపతి రూరల్ 67, పుత్తూరు 70, చి త్తూరు అర్బన్ 68, చిత్తూరు రూరల్ 45, మ దనపల్లె 61, పీలేరు 59, పుంగనూరు పరిధిలో 84 విద్యుతు చౌర్యం, అపరాధరుసుం పరంగా కేసులు బుక్ చేశారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణ కింద 492 కేసులకు రూ.11.50 లక్షలు, విద్యుత్ చౌర్యం పరంగా 69 కేసులకు రూ.81 వేలు అపరాధరుసుం, జరిమానాగా విధించా రు. మొత్తం 561 సర్వీసులపై రూ. 12.31 లక్ష లు అపరాధరుసుం, జరిమానా చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి పేర్కొన్నారు.



సర్వభూపాల వాహనంపై శ్రీవారు



విద్యుద్దీప కాంతులీనుతున్న శ్రీవారి ఆలయం



కల్పవృక్ష వాహనంపై దేవదేవుడు

స్మరామీ.. సర్వాంతర్యామి







అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని దర్శనంతో భక్తజనులు పులకించారు.. కల్పవృక్షవాహనంపై కొలువుదీరిన కోనేటి రాయుని వీక్షించి పరవశించారు.. ఆపదమొక్కులవాడా అనాథరక్షకా పాహిమాం అంటూ వేడుకున్నారు.. కలియుగ వైకుంఠంలో దివ్యతేజోవిరాజితుడైన వేంకటనాథుని వైభవాన్ని వేనోళ్ల కొనియాడారు.. సర్వభూపాల వాహనంపై రాజసంగా అధిష్టించిన శేషశయనవాసుని సేవించుకుని తరించారు. తిరుగిరులు మార్మోగేలా గోవిందనామాన్ని స్మరిస్తూ పులకరించారు.. మాడ వీధుల్లో విహరిస్తున్న దేవదేవునికి కర్పూరహారతులు సమర్పించి పునీతులయ్యారు.

సర్కారు హారతి మాత్రమే

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించనున్న గరుడ సేవలో సర్కారు హారతి మాత్రమే ఉంటుందని టీటీడీ స్పష్టం చేసింది. ఇతర హారతులు అనుమతించబడవని, భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరింది.



తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. రాత్రి సర్వభూపాల వాహనంపై దర్శనమిచ్చారు.







సర్వభూపాల వాహన సేవలో కళాకారుల నృత్యం



సీతా స్వయంవరం ఘట్టం ప్రదర్శిస్తున్న కళాకారులు



కల్పవృక్ష వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన

కాంచిన కనులదే భాగ్యం..

తన ఎంతో ఇష్టమైన మూషికాన్ని వాహనంగా చేసుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయస్వామి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో మూడవ రోజు గురువారం ఉదయం ఆలయంలో విశేష అభిషేక పూజలు జరిగాయి. శ్రీసిద్ధి, బుద్ధి సమేతంగా స్వామివారికి గ్రామోత్సం నిర్వహించారు. రాత్రి మూషిక వాహనంపై ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. కళాకారులు చెక్క భజనలు.. కోలాటాల ప్రదర్శనతో ఊరేగింపు శోభాయమానంగా సాగింది. ఆస్థాన మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను రంజింపజేశాయి.

- కాణిపాకంలో నయనానందకరంగా బ్రహ్మోత్సవాలు
- మూషిక వాహనంపై విహరించిన లంబోదరుడు
- రంజింపజేసిన సాంస్కృతిక ప్రదర్శనలు



ఆలయ ఆస్థాన మండపంలో నృత్య ప్రదర్శన

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం మూలస్థానంలోని స్వయంభు వినాయకస్వామికి గంధం తదితర విశేష ద్రవ్యాలతో అభిషేకం చేసి సుందరంగా అలంకరించి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనతరం మూషిక వాహన ఉభయదారులకు



మూషిక వాహనంపై శ్రీసిద్ధి,బుద్ధి సమేతంగా విహరిస్తున్న వినాయకుడు

ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రి తొమ్మిది గంటలకు మూషిక వాహన సేవ ప్రారంభమైంది. ముందుగా సిద్ధి, బుద్ధి సమేత గణనాథుని ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపుగా అలంకార మండపంలో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అధికారులు, ఉభయదారులు భుజాలపై మోసుకుంటు ఊరేగింపుగా తీసుకెళ్లి మూషిక వాహనంపై అధిష్ఠింపజేశారు. తదుపరి మేళతాళాలతో, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధుల్లో, పుర వీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్న, పెద్ద శేష వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం స్వామివారు చిన్నశేష వాహనంపై, రాత్రి పెద్ద శేష వాహనంపై ఊరేగనున్నారు. వేకువజామున ప్రత్యేక అభిషేకపూజల అనంతరం భక్తులకు దర్శనం ఉంటుంది.

శ్రీశైలం, శ్రీకాళహస్తి ఆలయాల నుంచి పట్టువస్త్రాలు



పట్టు వస్త్రాలను తీసుకు వస్తున్న శ్రీశైల దేవస్థానం ఈఓ, బోర్డు సభ్యులు

కుమారునికి తండ్రి ఆలయాల నుంచి పట్టు వస్త్రాలు అందాయి. గురువారం ఉదయం శ్రీశైల భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి దేవాలయం నుంచి ఈఓ లవన్న, బోర్డు సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, విజయలక్ష్మి పట్టువస్త్రాలను తీసుకొచ్చారు. మధ్యాహ్నం శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం నుంచి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబు, బోర్డు సభ్యులు పట్టు వస్త్రాలను తీసుకొచ్చారు. వారికి కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వస్త్రాలను స్వామి సన్నిధిలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. వారు మాట్లాడుతూ పట్టువస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నామని, బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.



శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఆలయ చైర్మన్, సభ్యులు, ఈఓ

నిత్యాన్నదానానికి 2.5టన్నుల కూరగాయలు



నిత్యాన్నదానానికి 2.5 టన్నుల కూరగాయలను ఆలయ అధికారులకు అందిస్తున్న దాతలు

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదానానికి 2.5టన్నుల కూరగాయలను కర్ణాటకలోని కోలార్, నంగలి చెందిన మిత్రబృందం వితరణగా అందించారు. గురువారం వారు ప్రత్యేక వాహనంలో ఆలయం వద్దకు కూరగాయలను తీసుకొచ్చి ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, సూపరింటెండెంట్లు కొదండపాణి, రంగస్వామికి అందించారు. దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళంఅందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదాన పథకానికి గురువారం రూ.లక్ష విరాళం అందింది. పూతలపట్టు మండలం తేనేపల్లెకు చెందిన కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఆలయానికి విచ్చేసి ఇన్‌స్పెక్టర్ బాబుకు ఈమేరకు విరాళం అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ పారదర్శకమైన ఓటర్ల జాబితాకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, బీఎల్‌వోలతో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 అంశాలపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రకియలో తహసీల్దార్ నుంచి బీఎల్‌వో వరకు అందరికీ ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. మార్గదర్శకాలను అనుసరించి పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ ప్రక్రియలో తహసీల్దార్లు కీలక పాత్ర పోషించాలన్నారు. ఇప్పటి వరకు చేర్పులు, మార్పులకు అందిన క్లెయిమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరమే ఆమోదించాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించేందుకు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీవోలు రేణుక, శివయ్య, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీలు



మాట్లాడుతున్న సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీల్లో ఇకపై గ్రామ స్వరాజ్ యాప్(నగదు రహిత లావాదేవీలు) పాలన సాగుతుందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులకు ఈ అంశంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో జరిగే లావాదేవీలను ఈ యాప్‌లో నమోదు చేయాలన్నారు. 2వేలు జనాభా ఉన్న పంచాయతీలకు క్యూఆర్ కోడ్ ఇచ్చినట్లు తెలిపారు. 3వేలు జనాభా ఉన్న పంచాయతీలకు పీఓఎస్ మిషన్లు అందజేశామన్నారు. వీటి ద్వారా నగదు రహిత లావాదేవీలను చేయాలని తెలిపారు. డీపీఓ లక్ష్మి మాట్లాడుతూ స్వామిత్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో ఆస్తిపత్రాలను త్వరలో అందజేయాలని తెలిపారు. పల్లెల్లో ఆక్రమణలు ఉంటే మూడు నోటీసులు అందజేసి తొలగించాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా చూడాలన్నారు. డీపీఆర్పీ డీసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పౌర సేవలపై విస్తృత అవగాహన


డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : సచివాలయాల్లో అందుతున్న పౌరసేవలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని డీఆర్‌వో రాజశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నోటరీ, అఫిడవిట్ సేవల అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో 540 పౌర సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల్లో జనన,మరణ ధ్రువీకరణపత్రాల, మ్యూటేషన్‌ల జారీకి వారంలో సోమ, గురువారాల్లో నోటరీ అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో ఏ సచివాలయానికి ఏ నోటరీ అనే విషయాన్ని మ్యాపింగ్ చేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ సేవలపై క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చే దిశగా పనిచేయాలని తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణతో ఆర్థిక పురోగతి


చిత్తూరు అగ్రికల్చర్: పశుపోషణతో ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును రైతులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ భవనంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకంపై రైతులు, నిరుద్యోగ యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా గొర్రెలు, మేకలు, నాటు కోళ్లు, పందుల అభివృద్ధి యూనిట్లు , పాతర గడ్డి, సమీకృత దాణా తయారీ యూనిట్లను రాయితీపై మంజూరు చేస్తోందన్నారు. ఈ పథకంలో యూనిట్ల మేరకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల మేరకు గరిష్ట రాయితీ ఉంటుందని తెలిపారు. తక్కువ వ్యయంతో కూడిన నూతన సాంకేతికతతో యూనిట్ల నిర్వహణను చేపట్టే విధంగా చర్యలు తీసుకుందన్నారు. ఎగుమతుల ద్వారా కూడా విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తూ దేశ ఆర్థిక పురోగమనంలో పాలు పంచుకోవచ్చని తెలిపారు. యూనిట్ల నిర్వహణలో అనుభవం ఉన్న పశు పోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు ముందుకు వస్తే అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని వివరించారు. పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ పాల్గొన్నారు.

సమతులం..ఆరోగ్య సోపానం

మాతా, శిశు సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారి ఆరోగ్యంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. ఇందు కోసం ఏటా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు 'రాష్ట్రీయ పోషణ్' కార్యక్రమం ద్వారా మాసోత్సవాలు నిర్వహిస్తోంది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారంపై సూచనలివ్వడంతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను అధికారులు అంచనా వేస్తారు. తల్లిపాల విశిష్టతపై మహిళలను చైతన్య వంతులను చేస్తారు. జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు.


బైరెడ్డిపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

- జిల్లాలో రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు
- తల్లిపాల విశిష్టతపై అవగాహన
- ఈనెల 30 వరకు ఐసీడీఎస్ కార్యక్రమాలు
- ఆరోగ్య సంరక్షణపై చైతన్యమే లక్ష్యం



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పోషణ్ మాసోత్సవాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. తల్లీబిడ్డ ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తోంది. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవమయ్యే వరకు వారి ఆరోగ్యం పట్ల స్త్రీ, శిశు సంక్షేమశాఖ ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, చిన్నారుల ఆరోగ్యంపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు నిర్వహించ నున్నారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అంగన్‌వాడీ కార్యకర్తలతో వైద్య, ఆరోగ్య శాఖ పలు శాఖలను భాగస్వామ్యం చేశారు. పిల్లల ఎత్తు, బరువు కొలవడం, తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించడంతోపాటు టీకాలు వేస్తున్నారు. అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, శిశువు పుట్టినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టించడం, ఆరు నెలల వరకు తల్లి పాలు తప్పనిసరిగా ఇచ్చేలా అవగాహన కల్పించడం, ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం , గర్భిణులు, బాలింతలు పోషకాల కోసం ఆకుకూరలు, తృణధాన్యాలు విధిగా తీసుకునేలా చైతన్యం తీసుకు వస్తున్నారు.

> పకడ్బందీగా మాసోత్సవాలు
>
> 
>
> తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పోషణ మాసోత్సవాలు జిల్లాలో అన్ని అంగన్‌వాడీల పరిధిలో నిర్వహిస్తున్నాం. ముందుగా సామ్, మామ్(బరువు తక్కువ, ఎక్కువ) పిల్లలను గుర్తించడం, గర్భిణులు, బాలింతలకు యోగా నేర్పించడం, మంచి ఆహారం తీసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. పోషకాల లోపం ఉన్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వడంతో పాటు వారానికి ఒక సారి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. వివిధ కార్యక్రమాల ద్వారా తల్లులకు ఆరోగ్యం, పౌష్టికాహారం ఆవశ్యకతలపై అవగాహన కల్పిస్తున్నాం.
>
> – నాగశైలజ, పీడీ, ఐసీడీఎస్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పలమనేరు: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమిళనాడులోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తూ పట్టణంలో సెల్వం(35) కాపురం ఉంటున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కాపాడేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆయన మృతిచెందాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్ల మంజూరు

చిత్తూరు అగ్రికల్చర్: నేషనల్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ (ఎన్‌ఎంఎస్‌ఏ) కింద వర్షాధార ప్రాంత అభివృద్ధి (ఆర్‌డీఏ) కాంపోనెంట్ ద్వారా రాయితీపై ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 25 యూనిట్లు మంజూరు కాగా, ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షల మేరకు రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు. చిరుధాన్యాల నూర్పిడీ యంత్రాలు, పప్పు దినుసుల నూర్పిడి యంత్రాలు, వేరుశెనగ నూర్పిడీ యంత్రాలను యూనిట్ల వారీగా మంజూరు చేసినట్లు వివరించారు.

శ్రీవారిమెట్టు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

- కాలినడకన తిరుమలకు చేరుకోనున్న భక్తులు
- గరుడ సేవను పురస్కరించుకుని ప్రత్యేక పార్కింగ్

చంద్రగిరి: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారిమెట్టు వద్ద టీటీడీ విజిలెన్స్, చంద్రగిరి పోలీసు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన ప్రధానమైంది గరుడ సేవ. శుక్రవారం గరుడ సేవ సందర్భంగా శ్రీవారిమెట్టు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు కాలినడకన వెళ్లనున్నారు. ఈ క్రమంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలీసు శాఖ నుంచి ఇప్పటికే అదనపు సిబ్బందితో శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు ప్రాంతాల్లో నియమించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద ఎత్తున భక్తులు రానుండడంతో ప్రత్యేక కారు పార్కింగ్, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కాలినడకన వెళ్లే భక్తుల సౌకర్యార్థం అల్పాహారాన్ని అందించేందుకు టీటీడీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

15వేల మంది భక్తులు రాక

శ్రీవారి గరుడసేవ సందర్భంగా శుక్రవారం 15వేలకు పైగా భక్తులు శ్రీవారిమెట్టు మార్గం గుండా తిరుమలకు చేరుకోనున్నట్లు అధికారులు అంచనా వేశారు. చంద్రగిరి డీఎస్పీ డాక్టర్ యశ్వంత్ నేతృత్వంలో సీఐ రాజశేఖర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనాలకు సైతం ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. గురువారం నుంచి శనివారం వరకు పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్‌ఐలు హిమబిందు, రవీంద్రనాథ్ నాయక్ పాల్గొన్నారు.

చివరి లోడ్ త్వరగా తోలేద్దామనే ఆత్రుతతో..

- ట్రాక్టర్ ట్రాలీకి వైర్లు తగిలి యువకునికి కరెంట్ షాక్
- ఎగిరి పాడుబడ్డ బావిలో పడి మృతి
- మృతదేహాన్ని వెలికి తీసిన ఫైర్ సిబ్బంది


ట్రాక్టర్ ట్రాలీకి తగిలిన విద్యుత్ తీగలు (ఇన్‌సెట్) మృతి చెందిన రజని(ఫైల్)

పలమనేరు: పొద్దున నుంచి వృథా మట్టిని ఓ పల్లపు ప్రదేశాన్ని పూడ్చుతూ.. ఆఖరి లోడ్ తోలి ఇంటికెళ్దామనే ఆత్రుతలో ట్రాక్టర్ ట్రాలీని పైకెత్తడంతో కరెంట్ తీగలు తగిలి షాక్ కొట్టి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం పట్టణంలోని ఓంశక్తి ఆలయం వద్ద విషాదం నింపింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని టి.వడ్డూరు గ్రామానికి చెందిన క్రిష్ణప్ప కుమారుడు రజని(24) తండ్రికి సాయంగా ట్రాక్టర్ నడుపుతుంటాడు. ఈ క్రమంలో వారి గ్రామంలోని వృథామట్టిని పట్టణ సమీపంలోని ఓంశక్తి ఆలయం వద్ద పల్లంగా ఉన్న ఓ స్థలాన్ని పూడ్చేందుకు తోలుతున్నాడు. రెండుమూడు రోజులుగా మట్టిని ట్రాక్టర్‌తో తోలే కార్యక్రమం సాగుతోంది. గురువారం సాయంత్రం ఆఖరి లోడ్‌ను త్వరగా తోలి ఇంటికెళ్లాలని రజని భావించాడు. కట్టపై మట్టిలోడ్డు ట్రాక్టర్‌ను నిలిపి ట్రాలీని పైకి లేపి బోల్టును తీసేందుకు ప్రయత్నించాడు. ఈసమయంలో లెవన్ కేవీ కరెంట్ తీగలు ట్రాక్టర్ ట్రాలీకి తగిలాయి. ఈ విషయం గమనించని రజని ట్రాలీ వెనుకవైపు బోల్టును ముట్టుకోవడంతో కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. అక్కడి నుంచి కొన్ని అడుగుల దూరం ఎగిరిపడి కిందనున్న పాడుపడిన బావిలో పడిపోయాడు. ఆ బావి చెత్తా చెదారాలతో పూడిపోయి ఉంది. అందులో కూరుకుపోయాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని కొంతసేపు కష్టపడి మృతదేహాన్ని వెలికి తీశారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. కాగా ఇతనికి ఇంకా వివాహం కాలేదు. ప్రమాద విషయం తెలిసి టి.వడ్డూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి ఎదికొచ్చిన బిడ్డ ఇలా మృతి చెందడంపై కుటుంబ సభ్యుల రోదన వర్ణనాతీతంగా ఉంది.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి


భవ్యశ్రీ (ఫైల్)

పెనుమూరు(కార్వేటినగరం): ఇంటర్మీడియెట్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కావూరివారిపల్లె పంచాయతీ ఠాణా వేణుగోపాలపురంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ అనిల్‌కుమార్ కథనం మేరకు .. ఠాణా వేణుగోపాలపురం గ్రామానికి చెందిన మునికృష్ణ, పద్మావతి దంపతుల కుమార్తె భవ్యశ్రీ(17) పెనుమూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈనెల 17వ తేదీ సాయంత్రం ఆరుగంటల నుంచి అదృశ్యమైంది. 18వ తేదీ ఉదయం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం రాత్రి 9గంటలకు ఎగువచెరువు గ్రామస్తులు వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా గ్రామ సమీపంలోని బావివద్దకు చేరుకున్నారు. బావిలో యువతి మృత దేహం తేలాడుతుండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మృత దేహాన్ని వెలికి తీశారు. భవ్యశ్రీ మృతదేహంగా అనుమానించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న భవ్యశ్రీ తల్లిదండ్రులు తమ కుమార్తేనని నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతికి కారణాలు తెలియక పోవడంతో, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాఠశాలకు వెళ్లే దారి మూసివేత


గ్రామస్తులతో చర్చిస్తున్న మండల అధికారులు

వి.కోట: మండలంలోని కుమ్మరమడుగు ప్రాథమిక పాఠశాలకు గతంలో స్థలం ఇచ్చిన దాతే దారిని ముళ్ల కంపలతో మూసివేశారు. యథావిధిగా గురువారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఆరుబైటే బైఠాయించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కుమ్మరమడుగు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కలసి పాఠశాలకు తమ స్థలం దానమిచ్చారు. ఇందులో ఓ వ్యక్తికి గ్రామస్తులతో తగదాలు వచ్చాయి. దీంతో ఆయన దారిని మూసివేశారు. ఇలాగైతే చదువులేట్లా సాగేది అంటూ పాఠశాల ముందే విద్యార్థులు, తల్లిదండ్రులు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ చంద్రశేఖర్, ఎంపీపీ యువరాజ్, తహసీల్దార్, పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. వారికి సర్దిచెప్పి పాఠశాలకు దారి సమస్య తాత్కాలికంగా పరిష్కరించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు.

ఎంపీడీఓలకు పోస్టింగ్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాకు ఏఓ, ఈఓపీఆర్డీలు పదోన్నతిపై ఎంపీడీఓలుగా వచ్చారు. వీరికి ప్రభుత్వం మండలాలను కేటాయించింది. వివరాలను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి గురువారం వెల్లడించారు.

గతంలో ఉన్న జిల్లా	పేరు	కేటాయింపు
కడప	రహీం	పెద్దపంజాణి
	పుల్లయ్యబాబు	నాగలాపురం
	హరినారాయణ	పెద్దమండ్యం
	శివశంకర్	రామకుప్పం
	కృష్ణమూర్తి	నారాయణవనం
సత్యసాయి	ఖాదర్‌బాషా	కుప్పం
అనంతపురం	కొల్లప్ప	ములకలచెరువు
	లక్ష్మీనరసింహ	కురబలకోట
చిత్తూరు జిల్లా	శ్రీనివాసులు	ఆర్‌సీపురం
	రఫీ	వి.కోట

'గురుకుల' ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పులిచెర్ల(కల్లూరు): మండలంలో నూతనంగా ప్రారంభం కానున్న మహాత్మా జ్యోతీరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ సునీత గురువారం తెలిపారు. 5, 6, 7 తరగతుల్లో ప్రవేశం కోసం జిల్లాలోని ఏ ప్రాంతం వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు పులిచెర్లలోని పాత మండల పరిషత్ కార్యాలయంలో తనను సంప్రదించవచ్చని ప్రిన్సిపల్ చెప్పారు.

నేడు గుడిపాలలో జగనన్నకు చెబుదాం

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు నియోజకవర్గం గుడిపాలలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం జరుగనుంది. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిల్ల కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజల నుంచి సమస్యల వినతులు స్వీకరించనున్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.